నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శాలిబండ: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈఓ ప్రకటనలో తెలిపారు. మదీనా విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, పత్తర్‌గట్టి, పురానీహవేలి, సత్తర్‌బాగ్, ఖిల్వత్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. ఆలిజాకోట్లా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు. చౌక్, చార్మినార్, దారుషిఫా ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు. సిటీ కాలేజీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

అజీజ్ ప్లాజాలో జీహెచ్‌ఎంసీ అధికారుల తనిఖీ



అబిడ్స్: జీహెచ్‌ఎంసీ అధికారులు బేగంబజార్‌లోని అజీజ్ ప్లాజాలో తనిఖీలు చేపట్టారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశాల మేరకు శుక్రవారం అజీజ్ ప్లాజాలోని దుకాణాలను అబిడ్స్–14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్ ఆధ్వర్యంలో ఏఎంఓహెచ్ డాక్టర్ వెంకటరమణ, ఏఎంసీలు, టీఐలు, బిల్ కలెక్టర్లు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి ట్రేడ్ లైసెన్సు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న 18 దుకాణాలను అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ..ప్రతి కాంప్లెక్స్‌లో, ప్రతి ప్రాంతంలో ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్సులపై ప్రత్యేక డ్రైవ్ కొనసాగిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలని లేనిచో దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

పెంచిన ఆర్టీసీ చార్జీలను తగ్గించాలి



కృష్ణాగుప్తా

అబిడ్స్: ఆర్టీసీ బస్ చార్జీలను పెంచి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదల నడ్డి విరుస్తుందని గోల్కొండ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ముక్కా కృష్ణాగుప్తా అన్నారు. శుక్రవారం బేగంబజార్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఇష్టానుసారంగా వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి ఆర్టీసీని దివాళా తీయించారని ఆరోపించారు. బస్సు చార్జీలు పెంచి పురుషులపై భారం మోపడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. వెంటనే పెంచిన ఆర్టీసీ చార్జీలను తగ్గించాలన్నారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు.

సోషల్ గేమింగ్‌లో పాలసీ సెక్రటేరియట్ ఏర్పాటు

అఫ్జల్‌గంజ్: సోషల్ గేమింగ్‌లో పాలసీ సెక్రటేరియట్‌ను గేమ్ డెవలపర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (జీడీఏఐ) ఏర్పాటు చేసింది. వీడియో గేమ్, సోషల్ గేమింగ్ కోసం ఏర్పాటు చేసినట్లు జీడీఏఐ చైర్‌పర్సన్ శ్రీధర్ ముప్పిడి తెలిపారు. వీడియో గేమ్ పరిశ్రమతో, ప్రభుత్వ సంస్థల మధ్య నిర్మాణాత్మక అనుసంధానికి ఈ పాలసీ సెక్రటేరియట్ దోహద పడుతుందన్నారు. వీడియో గేమింగ్ పర్యావరణ వ్యవస్థలో స్థిరమైన వృద్ధిని పెంపొందించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేసే ఏకీకృత గొంతుకగా కృషి చేస్తామన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అందజేత

చాంద్రాయణగుట్ట: పోగొట్టుకున్న ఫోన్లను ఛత్రినాక పోలీసులు శుక్రవారం 32 మంది బాధితులకు అందజేశారు. పోయిన ఫోన్ల వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయగా లభ్యమైన ఫోన్లను బాధితులను పోలీస్‌స్టేషన్‌కు రప్పించి ఇన్‌స్పెక్టర్ కె.ఎన్.ప్రసాద్ వర్మ, అదనపు ఇన్‌స్పెక్టర్ గోపాల్ రావులు అందజేశారు. దీంతో బాధితులు పోలీసులకు ధన్యవాదాలు తెలియజేశారు.

గృహిణి అదృశ్యం



అస్రా బేగం

నాంపల్లి: భర్తతో గొడవపడి గృహిణి అదృశ్యమైన ఘటన హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..మల్లేపల్లి సహారా డైరీ ఫామ్ సమీపంలో నివాసం ఉండే ఆబిద్ కుమారుడు మహ్మద్ సమీర్‌కు 2022లో అస్రా బేగం(25) తో వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల బాలుడు ఉన్నారు. ప్రస్తుతం అస్రా బేగం ఏడు నెలల గర్భవతి. ఈ నెల 9న అర్ధరాత్రి భార్యాభర్తలు గొడవపడ్డారు. గొడవ సద్దుమణిగి ఇద్దరూ నిద్రకు ఉపక్రమించారు. 10న ఉదయం 8 గంటల తరువాత బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. భర్త ఆమె ఆచూకీ కోసం అన్ని చోట్లా వెతికినా ఫలితం లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భద్రత ప్రమాణాలు పాటించాలి

సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి



సమావేశంలో డీసీపీ శిల్పవల్లి, అడిషనల్ డీసీపీ ఆనంద్

అబిడ్స్: బాణాసంచా దుకాణాల నిర్వాహకులు భద్రత ప్రమాణాలు పాటించాలని సెంట్రల్ జోన్ డీసీపీ కె.శిల్పవల్లి పేర్కొన్నారు. శుక్రవారం బాణాసంచా దుకాణాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న బాణాసంచా దుకాణాలతో పాటు ఓపెన్ స్థలాలలో తాత్కాలికంగా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసేవారు ఈ నెల 15వ తేదీ లోపు పోలీస్ శాఖకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జీహెచ్‌ఎంసీ ఫైర్ డిపార్ట్‌మెంట్‌తో ఎన్‌ఓసీ తెచ్చుకోవాలన్నారు. ఖాళీ స్థలాల్లో ఏర్పాటు చేసుకునే బాణాసంచా దుకాణాల వారు తమ దుకాణాల వద్ద నీరు, ఇసుకతో పాటు ఫైర్ సేఫ్టీకి చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలుదారులు పెద్ద మొత్తంలో దుకాణాలకు వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండి వ్యాపారులు అన్ని విధాల ఏర్పాట్లు చూసుకోవాలన్నారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా దుకాణాల నిర్వాహకులే జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ప్రతిరోజు సంబంధిత సెక్టార్ ఎస్ఐలు, ఇన్‌స్పెక్టర్లు పర్యటించి భద్రత ప్రమాణాలను తనిఖీలు చేస్తారని డీసీపీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ ఆనంద్ బాణాసంచా దుకాణాల నిర్వాహకులు పలు సూచనలు చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రవీణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ భరత్ కుమార్, అధికారులు, వ్యాపారాలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న చార్మినార్ ఎమ్మెల్యే, ముస్లిం మత పెద్దలు

చార్మినార్: మహమ్మద్ ప్రవక్త సలుల్లాహి అలైహి వసల్లంపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ముస్లిం మత పెద్దలు, చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ తదితరుల బృందం శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ వీ.సీ.సజ్జనర్‌ను కలిసి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ఈ విషయంపై నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో 40కి పైగా ఫిర్యాదులు చేసినందున వెంటనే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రతినిధుల బృందం పోలీస్ కమిషనర్‌ను కోరింది. ఆయనను కలిసిన వారిలో సెంట్రల్ మిలాద్ ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ షేఖున్ అహ్మద్ ఖాద్రీ షతారీ, ప్రధాన కార్యదర్శి మౌలానా సయ్యద్ ఖాదిర్ మొహియుద్దీన్ ఖాద్రీ, జునేద్ పాషా జరీన్ కుల్లాలతో పాటు మౌలానా హుహమ్మద్ షాహ్మద్ సయిఫుల్లా సైఫ్ పాషా తదితరులు ఉన్నారు.

గోల్కొండ పీఎస్‌లో ఫిర్యాదు...

గోల్కొండ: మహ్మద్ ప్రవక్తను కించపరుస్తూ మాట్లాడిన ఎమ్మెల్యే రాజాసింగ్‌పై గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు దాఖలైంది. గోల్కొండ నురానీ, కౌసర్ మసీదు నిర్వహణ కమిటీ వారితో పాటు గోల్కొండ సిరత్ కమిటీ వారు ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం సాయంత్రం గోల్కొండ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

మానవతా దృక్పథంతో డయాలసీస్ సేవలు అందించాలి



పేషంట్‌ను పరామర్శిస్తున్న అక్బరుద్దీన్ ఒవైసీ

గోల్కొండ: కిడ్నీ సమస్యలతో బాధపడుతూ డయాలసీస్ చేసుకుంటున్న వారికి మానవతా దృక్పథంతో సేవలు అందించాలని మజ్లిస్ శాసన సభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకీ సాలర్‌జంగ్ కాలనీలోని సాప్ కిడ్నీ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కిడ్నీ సెంటర్‌లో చికిత్స పొందుతూ డయాలసీస్ చేయించుకున్న పేషంట్లను పలకరించారు. మూడు దశాబ్దాలుగా వైద్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న సాప్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ నియాజ్ అహ్మద్ ఖాన్‌ను ఆయన అభినందించారు. నెఫ్రాలజిస్ట్ డాక్టర్ మహ్మద్ షోయబ్ అహ్మద్ ఖాన్, సాప్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ ఆకిబ్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



మహోత్సవాల్లో కమిటీ ప్రతినిధులు, భక్తులు

గౌలిపురా: పటేల్‌నగర్‌లోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో నూతన ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటలకు గురువందనం, స్వస్తి వచనం, గణపతి పూజ, గోపూజ, పుణ్యాహవచనం, సాయంత్రం 6 గంటలకు స్థాపిత దేవతా హవనములు, మూలమంత్ర జపం తదితర పూజా కార్యక్రమాలను ఆలయ పునఃనిర్మాణ దాతలు అల్లం మధుశ్రీ, అల్లం శ్రీనివాస్ రావు దంపతుల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ మహోత్సవాల్లో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దీపావళికి నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగించాలి



డీఈ మల్లాది శ్రీధర్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

చార్మినార్: దీపావళికి నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగించాలని భాగ్యలక్ష్మి ఆలయం ట్రస్టీ సూర్య ప్రకాష్, బీజేపీ సీనియర్ నాయకుడు ప్యారసాని వెంకటేష్ కోరారు. ఈ నెల 18 నుంచి 23 వరకు జరిగే దీపావళి వేడుకలకు హాజరుకావాలని కోరుతూ శుక్రవారం టీజీఎస్‌పీడీసీఎల్ చార్మినార్ డీఈ మల్లాది శ్రీధర్‌కు ఆహ్వానపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ..ఈ నెల 20న ఆలయంలో పూజలను కనులపండువగా నిర్వహించనున్నామని..ఈ పూజల్లో పాల్గొనాలని డీఈని కోరామన్నారు.

విద్యా వ్యవస్థలో మార్పులు అవసరం



గన్‌ఫౌండ్రీ: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో, బోధన పద్ధతులు, పాఠ్యాంశాలపై మార్పులు అవసరమని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏడాది కాలంలో ఉన్నత విద్యలో అనేక మార్పులు తీసుకువచ్చినట్లు వెల్లడించారు. శుక్రవారం రవీంద్రభారతిలో తపస్య కాలేజీ ఆఫ్ కామర్స్ మేనేజ్‌మెంట్ కళాశాల సమవర్తనోత్సవ్ పేరిట స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రులైన వెయ్యి మంది విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మానవ విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించడానికి విద్య సంస్థలు కృషి చేయాలని కోరారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ కామర్స్ విభాగం డీన్ ఆచార్య డాక్టర్ కె.కృష్ణ చైతన్య, తపస్య వద్య సంస్థల డైరెక్టర్ ఓగూరి శ్రీహరి పాల్గొన్నారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి పట్టివేత

నాంపల్లి: కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో గురువారం రాత్రి పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. రైల్వే డీఎస్పీ ఎస్.ఎన్.జావేద్, నార్కొటిక్ ఈగల్ టీమ్ డీఎస్పీ పి.భిక్షపతి రావు తెల్పిన మేరకు..ఒడిశాకు చెందిన కిషోర్ లిమా తన అనుచరులు రాజేష్ బిసోయ్, సుజాతా సింగ్ అనే ఇద్దరు కూలీల ద్వారా కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో 16 పాకెట్లలో 33 కేజీల గంజాయిని ముంబైకి రవాణా చేసేందుకు ప్లాన్ చేశాడు. ఈ మేరకు కూలీలు ఇద్దరూ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు థర్డ్ ఏసీ బోగీలో ఉండగా..రైలు బేగంపేట రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే పోలీసులు తనిఖీలు చేపట్టారు. తనిఖీలు చేస్తున్నారన్న భయంతో కూలీలిద్దరు రైలు దిగి ప్లాట్‌ఫారం మీదకు వెళ్లారు. అక్కడ నుంచి ఏసీ వెయిటింగ్ హాలులోకి చేరుకున్నారు. పోలీసులకు అనుమానం రావడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయిని ముంబైకి తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారు. దీంతో వారి వద్ద ఉన్న రూ.16.5 లక్షల విలువైన 33 కేజీల గంజాయిని, రెండు సెల్‌ఫోన్లు, రైలు టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కిషోర్ లిమా కోసం గాలిస్తున్నారు.

ఘనంగా పట్టాభిషేకం వేడుకలు



జియాగూడ: స్కూల్ నుంచే విద్యార్థులకు పట్టాభిషేకం నిర్వహించి ప్రోత్సహించడం హర్షణీయమని ట్రస్మా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.గాలయ్య, అక్షదీప్ జూనియర్ కళాశాల డైరెక్టర్ అక్రమ్ అలీ అన్నారు. శుక్రవారం జియాగూడ ఇంద్రాణి మహా విద్యాలయ్ కరస్పాండెంట్, ప్రిన్సిపల్ ఎం.మిథిలేష్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టాభిషేకం వేడుకల 2బీహెచ్‌కే ప్లే గ్రౌండ్‌లో ఏర్పాటైన కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం స్కూల్‌లో జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులకు పట్టాభిషేకం వేడుకలు, ప్రమాణస్వీకారం నిర్వహించగా, పోలీస్ బ్యాండ్‌తో పరేడ్ చేసిన వారికి బ్యాడ్జీలను అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ దివ్యజ్యోతి, హెచ్ఓడీ ఇంద్రాణి అశోక్ కుమార్, కో ఆర్డినేటర్ ప్రియాంన్స్, ఇన్ చార్జి శ్వేతా, లీడ్ కో ఆర్డినేటర్ సింధుజ పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి బంగారు కిరీటం సమర్పణ

సుల్తాన్‌బజార్: గౌలిగూడకు చెందిన మధు కుటుంబ సభ్యులు రామ్‌మందిర్‌లో వేంకటేశ్వర స్వామికి బంగారు కిరీటాన్ని కానుకగా సమర్పించారు. శుక్రవారం గౌలిగూడలోని మధు నివాసం నుంచి మధు కుటుంబ సభ్యులు, గోషామహల్ బీఆర్ఎస్ నేత ఆనంద్‌కుమార్ గౌడ్ కలిసి స్వామివారి పల్లకీ ఊరేగింపులో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి బంగారు కిరిటాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాజు యాదవ్, రవియాదవ్, సురేష్‌యాదవ్, రాజు, రమేష్‌గౌడ్, అనిల్, శ్రీకాంత్, కిరణ్, రవి, రాజు పాల్గొన్నారు.

బహుమతి ప్రదానం

చాంద్రాయణగుట్ట: తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రతన్ టాటా వర్ధంతి సందర్భంగా మెహదీపట్నంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఉప్పుగూడకు చెందిన గడ్డమీద అక్షిత ముదిరాజ్‌కు ఆంగ్లభాష వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతిని ప్రదానం చేశారు. తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికల పురుషోత్తం, ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ ఎ.పాట్రిక్, సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయరాణి తదితరులు విద్యార్థినికి మెమొంటో అందజేసి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది మహ్మద్ షరీఫ్, జి.వేణుగోపాల్‌తో పాటు న్యూ మాస్టర్ మైండ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, శ్యామల అక్షితకు శుభాకాంక్షలు తెలిపారు.

కూలీలను ఎయిర్ గన్‌తో బెదిరించిన వ్యక్తిపై కేసు

గోల్కొండ: గృహపకరణాలను ఇంట్లోకి తెస్తున్న కూలీలపై ఎయిర్ గన్‌తో బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదయ్యింది. టోలిచౌకీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం..రాహుల్ కాలనీకి చెందిన కామ్‌రాన్ గత వారం తన రెండో అంతస్తులోని ఓ ఫ్లాట్‌ను అద్దెకు ఇచ్చాడు. శుక్రవారం సాయంత్రం అద్దెకు తీసుకున్న వ్యక్తి తన గృహపకరణాలను ఆటో ట్రాలీలో వేసి రాహుల్ కాలనీకి పంపాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న కామ్‌రాన్ సామగ్రిని మెట్ల మార్గం గుండా పైకి తీసుకువెళ్లాలని కూలీలకు చెప్పి ఇంట్లోకి వెళ్లిపోయాడు. కూలీలు లిఫ్ట్‌లో సామాన్లు తీసుకెళ్లడం గమనించిన కామ్‌రాన్ వారిని ఎయిర్ గన్‌తో బెదిరించాడు. ఈ విషయంపై కూలీలు టోలిచౌకీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతి లేకుండా నిల్వ ఉంచిన బాణాసంచా పట్టివేత

విజయనగర్‌కాలనీ: అనుమతి లేకుండా నిల్వ ఉంచిన బాణాసంచాను స్వాధీనం చేసుకున్న ఘటన శుక్రవారం టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బి.అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం..ఆర్యసమాజ్ కార్వాన్, కుర్మాజీగూడ కార్వాన్‌లో రెండు చోట్ల దాడులు జరిపి అనుమతి లేకుండా నిల్వ ఉంచిన సుమారు రూ.2 లక్షల విలువ చేసే బాణాసంచాను స్వాధీనం చేసుకున్నారు. ఆర్యసమాజ్ కార్వాన్‌కు చెందిన విజేందర్ సింగ్ (43), కుర్మాజీ గూడ కార్వాన్‌కు చెందిన టి.పురుషోత్తమ్ శంకర్(50)ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మెహిదీపట్నం డివిజన్‌లో విద్యుత్ అధికారుల పర్యటన



జానకీనగర్ కాలనీలో పర్యటిస్తున్న ముషారఫ్ ఫారూఖీ

గోల్కొండ: బస్తీబాటలో ఆకస్మిక తనిఖీల వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీ అన్నారు. శుక్రవారం ఆయన తన సిబ్బందితో కలిసి మెహిదీపట్నం డివిజన్‌లోని అయోధ్యనగర్, జానకీనగర్, రేతిబౌలి, సంతోష్‌నగర్, తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న ఎల్‌టీ ఓవర్ హెడ్ కండక్టర్ల స్థానంలో ఎయిర్ బంచడ్ కేబుల్ ఏర్పాటు చేయాలని సూచించారు. లోడ్ గ్రోత్ ఉన్న ప్రాంతాల్లో అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ఆయన తన వెంట ఉన్న అధికారులను ఆదేశించారు. గత వారం రోజులుగా తాము నిర్వహిస్తున్న బస్తీబాట కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులను నేరుగా కలుసుకునే అవకాశం లభిస్తుందన్నారు. డైరెక్టర్ ఆపరేషన్స్ నర్సింహులు, మెట్రో జోన్ సీఈ ప్రభాకర్, సెంట్రల్ సర్కిల్ ఎస్ఈ వెంకన్న, డీఈ సుధీర్‌కుమార్ తదితరులున్నారు.

ఇందిరా ప్రియదర్శిని విద్యార్థినుల విద్యా పర్యటన



అబిడ్స్: ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థినులు విద్యా పర్యటన చేపట్టారు. కళాశాల ఆర్థికశాస్త్ర విద్యార్థినులు ఆర్థికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఈ.పావని, హాజీరా బేగం, డాక్టర్ ఉస్మాన్, ఫిర్దౌస్ బేగం, రఫియా బేగంతో కలిసి ఖైరతాబాద్‌లోని గణాంకాల డైరెక్టర్ కార్యాలయంలో శుక్రవారం పర్యటించారు. ఆర్థిక శాస్త్రం, గణంకాల డైరెక్టరేట్ తెలంగాణ కార్యాలయంలో స్థూల రాష్ట్రీయ ఉత్పత్తి లెక్కింపులో ముఖ్యపాత్రను విద్యార్థినులకు డైరెక్టరేట్ అధికారులు జె.వెంకటరమణ, భారతి, రవీందర్‌రెడ్డి వివరించారు. డైరెక్టరేట్ ద్వారా సేకరించబడే 11 ప్రధాన గణాంక విభాగాలు, లెక్కించబడే గణాంక అంచనాలపై విద్యార్థినులందరికీ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా గణాంకాధికారి భారతి మాట్లాడుతూ..రంగారెడ్డి జిల్లా భారతదేశంలోనే అత్యధిక ధనిక జిల్లాగా ఎదిగిందన్నారు. వెంకటరమణ, ఎన్.మోహన్‌రెడ్డి, నీరంజన్ రెడ్డి, సంయుక్త, ప్రీతి, వెంకట నర్సయ్య తమ అనుభవాలను విద్యార్థినులతో పంచుకున్నారు.

కలుషిత నీటి సమస్యకు చెక్



గౌలిపురా: హనుమాన్‌నగర్ ఫేజ్–3లో కొన్ని రోజులుగా నెలకొన్న కలుషిత నీటి సమస్యను ఎట్టకేలకు శుక్రవారం పరిష్కరించారు. కొన్ని రోజులుగా స్థానిక ప్రాంతాల ప్రజలు కలుషిత తాగునీటితో పడరాని పాట్లు పడ్డారు. ఈ విషయమై పలుమార్లు అలియాబాద్ డివిజన్ జల మండలి అధికారులకు విన్నవించగా శుక్రవారం సిబ్బంది మరమ్మతులను చేపట్టి సమస్యను పరిష్కరించారు.

నెట్‌బాల్ పోటీలకు బీపీడీఏవీ విద్యార్థుల ఎంపిక

సంతోష్‌నగర్: బ్రహ్మ ప్రకాశ్ డీఏవీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆశ్రిత్, ప్రజానంద్, వంశీ, మోక్షిత బేగంపేట్ మహర్షి పాఠశాలలో జరిగిన నెట్‌బాల్ సెలక్షన్స్‌లో వారి ప్రతిభను కనబరిచి ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లోని డీఎస్ఏ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ వి.ఎస్.ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె.మధుబాల, డీఏవీ పాఠశాల ఏఆర్ఓ ఆనందవల్లి, ప్రిన్సిపాల్ వి.ఎస్.ప్రశాంత్, ఎల్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

బ్యాడ్మింటన్‌లో సత్తాచాటిన శాన్వి



ప్రశంసా పత్రంతో క్రీడాకారిణి శాన్వి

గన్‌ఫౌండ్రీ: బెంగళూర్‌లో కర్ణాటక బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్–13 ఆల్‌ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బాడ్మింటన్ టోర్నమెంట్‌లో నగరానికి చెందిన క్రీడాకారిణి శాన్వి లట్టాల అద్భుతమైన ప్రతిభను కనబరిచింది. సహచర క్రీడాకారిణి అన్య వుండిర్‌తో జతకట్టి అండర్–13 బాలికల డబుల్స్ విభాగంలో అద్భుతమైన ఆటతో మెయిన్ డ్రాకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం ఇండోర్ స్టేడియంలో ఆమెను పలువురు అభినందించారు. అనంతరం మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్ ముప్పాల వేణు మాట్లాడుతూ..పదేళ్ల వయస్సు గల శాన్వి అండర్–13లో రాణించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

సన్మానం



జితేందర్ సింగ్, సదానందంగుప్తాను సన్మానిస్తున్న సమితి సభ్యులు

జియాగూడ: ధూల్‌పేట నవరాత్రి ఉత్సవ సమితి హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రతి యేటా మాతా రాణికా విశాల్ జాగరణ్ వైభవంగా నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నానని సమితి అధ్యక్షుడు జితేందర్ సింగ్ అన్నారు. శుక్రవారం రహింపురాలో ఉత్సవ సమితి సభ్యులు అధ్యక్షుడు జితేందర్ సింగ్, నూతన అధ్యక్షుడు మాడిశెట్టి సదానందం గుప్తాను సమితి సభ్యులు ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం జితేందర్ సింగ్ మాట్లాడుతూ..4 ఏళ్లుగా తాను అధ్యక్షుడిగా ఉంటూ ఎంతో వైభవంగా నిర్వహించేందుకు సమితి సభ్యులతో కలిసి కృషి చేశానన్నారు. వచ్చే సంవత్సరం నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మాడిశెట్టి సదానందంగుప్తా మాట్లాడుతూ..వచ్చే సంవత్సరం కూడా భారీ ఎత్తున నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. సమితి చైర్మన్ శ్రీధర్‌బాబు, ప్రధాన కార్యదర్శి పిట్టల కృష్ణ, కోశాధికారి నిర్మేష సింగ్, సలహాదారులు ఎం.మహేష్, పి.రవీందర్ సింగ్, వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎస్.రాజన్‌కుమార్, టి.సచిన్ రాజ్‌సింగ్, పి.రంజిత్ కుమార్, రోమా ఆరోరా పాల్గొన్నారు.

అమెరికాలో ముగిసిన బతుకమ్మ ఉత్సవాలు



అమెరికాలో బతుకమ్మ ఆడుతున్న తెలుగు ఆడపడచులు

సుల్తాన్‌బజార్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చాటుతూ మన పండుగలను నిర్వహించుకోవడం ఎంతో గర్వకారణమని తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (టీటీఏ) వ్యవస్థాపకులు పైళ్ల మల్లారెడ్డి, ఏసీ చైర్ డాక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి, టీటీఏ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి మల్లిపెద్ది అన్నారు. టీటీఏ ఆధ్వర్యంలో అమెరికా వ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో బతుకమ్మ వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. న్యూయార్క్, ఇండియానా పోలీస్, చార్లెట్, న్యూ జెర్సీ అట్లాంటా, సియాటిల్, డల్లాస్, అరిజోనా, టాంపా, బోస్టన్, ఫిలిప్ డేల్ఫియా, అలబామా, మియామీ, పోర్ట్ ల్యాండ్ రాష్ట్రాలలో ఈ బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తెలంగాణ సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్తున్న మహిళా నాయకత్వ బృందమైన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నేషనల్ బతుకమ్మ అడ్వైజర్ కవితారెడ్డి జనరల్ సెక్రెటరీ శివారెడ్డి కొల్లా చేసిన అమూల్యమైన కృషికి టీటీఏ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.